క్లుప్తంగా

ఆలయానికి రూ.75 వేల విరాళం



దాత మండల జగన్‌తో ఆలయ కమిటీ సభ్యులు

కవిటి: మండలకేంద్రం కవిటిలోని జగన్నాథ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నేత, వ్యాపారవేత్త మండల జగన్ తనవంతుగా రూ.75 వేల విరాళాన్ని అందించారు. ఈ మొత్తంతో 50 సిమ్మెంట్ బస్తాలు, ఆరు మేఇటుకల్ని కొనుగోలు చేసినట్టు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి విరాళాలు ఇవ్వాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో పొల్లాయి ఉమామహేశ్వరరావు, మొగిలిపురి శీతారాం, కోళ్ల కృష్ణ, దేవాడ దుర్యోధన, తెలుకల ప్రేమానంద్‌సాహూ, నెయ్యిల కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ



స్టడీమెటీరియల్ అందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ వెంకటరమణ

కవిటి: మండల కేంద్రం కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రగడ వెంకటరమణ బోటనీ స్టడీ మెటీరియల్‌ను వితరణ చేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాజేశ్వరరావు చేతులమీదుగా 61 మంది బాలబాలికలకు బుధవారం అందించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం గొండ్యాల విష్ణుమూర్తి, పోలాకి హరి, మాదిన అనసూయమ్మ, కరుణశ్రీ ఉన్నారు.

విద్యా సామగ్రి అందజేత



విద్యా సామగ్రి కిట్లతో పిల్లలు, ఉపాధ్యాయులు

సోంపేట: ప్రతిఒక్కరికీ విద్యార్థి దశ కీలకమని జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాంబుడ్డి గణపతి అన్నారు. కొర్లాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని బుధవారం అందజేశారు. ప్రభుత్వ బడులను ప్రోత్సహించాలని ప్రధానోపాధ్యాయులు సాహుకారి గోవిందరాజులు గ్రామస్తులను కోరారు. ఉప సర్పంచ్ తామవ వాసుదేవు, గ్రామ పెద్దలు బంగారు పాపారావు, సంగారు డిల్లేశ్వరరావు, రామస్వామి ఉన్నారు.

ఓడీఎఫ్ సర్వే సత్వరమే పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీవో నీరజ

కంచిలి: గ్రామాల స్వచ్ఛత (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) సర్వేను వారం రోజుల్లోగా మండలంలో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎంపీడీవో వి.నీరజ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సర్వే చేసిన తర్వాత అంచనా వేసి ప్రభుత్వం చేపట్టే చర్యల ద్వారా స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఏర్పడుతోందని ఎంవోటీపీ పి. చాణక్య అన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ. ఎం.మోహనరావు ఉన్నారు.

108 అంబులెన్స్ పరిశీలన



వాహనాన్ని పరిశీలిస్తున్న జగన్నాథరావు

కాశీబుగ్గ: మందస మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను పలాస డివిజన్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు బుధవారం పరిశీలించారు. వాహన నిర్వహణ తీరుతెన్నులు, పరికరాల పనితీరుతో పాటు అత్యవసర మందుల నిర్వహణ, రికార్డులు, డ్యూటీ చార్ట్‌ను తనిఖీ చేశారు. వాహన సిబ్బంది జి.శంకరరావు, మురళీమోహన్‌రావు ఉన్నారు.

సర్కార్ బడులు కళకళ!

- వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలతో పెరిగిన ప్రవేశాలు
- నాడు–నేడు పథకంతో పాఠశాలల్లో చేకూరిన సౌకర్యాలు



రాజపురంలోని ఏపీమోడల్ స్కూల్

కవిటి: ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్యను అందించడంతోపాటు మౌలిక సదుపాయల కల్పనకు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పుడు తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు పూర్తిస్థాయిలో సత్ఫలితాలు ఇస్తున్నాయి. భారీగా పెరిగిన విద్యార్థుల ప్రవేశాలతో పాఠశాలలు కళకళలాడుతున్నాయి. కేంద్రం ప్రవేశపెట్టిన నేషనల్ ఎడ్యుకేషన్ (ఎన్ఈపీ–2020) పాలసీ అమలు ద్వారా ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతమైంది. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన విద్యాభివృద్ధికి ఇతర రాష్ట్రాల ప్రతినిధులు సైతం ప్రశంసలు వచ్చాయి. మనబడి నాడు–నేడు పథకం ద్వారా అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సమకూరాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో అత్యంత వెనుకబడిన ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సైతం గత ప్రభుత్వంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల స్థాయి విద్యలో చేపట్టిన విప్లవాత్మక మార్పులతో విద్యార్థుల ప్రవేశాలు, హాజరు శాతం మెరుగుపడడంలో ఎంతగానో దోహదపడింది. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అందించిన సంక్షేమ పథకాలు సర్కారు బడులపై తల్లిదండ్రులకు నమ్మకాన్ని పెంచింది. దీంతో ఈ ఏడాది కూడా ప్రవేశాలు మెరుగ్గా జరిగాయి. జగనన్న గోరుముద్ద పేరిట మధ్యాహ్న భోజన పథకంలో తీసుకువచ్చిన మార్పులు, జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ పిల్లలకు బాగా ఉపయోగపడ్డాయి. అలాగే వారి ఆరోగ్యం కోసం అందించిన రాగిజావ శారీరక దారుఢ్యాన్ని మెరుగుపర్చడంలో చక్కని ఫలితాలు నమోదు చేసింది. కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో ప్రభుత్వ బడులు గత ఏడాది కిటకిటలాడాయి. ఈ ఏడాది కూడా గత ప్రభుత్వంలో అందిన పథకాలన్నీ కొనసాగుతాయనే నమ్మకంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో బాగానే చేరారు. జూలై నెలాఖరువరకు ప్రవేశాలకు అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం గత ఏడాదికి సమానంగా అడ్మిషన్లు జరిగాయి.



ప్యానల్ బోర్డుపై ఏపీమోడల్‌స్కూల్‌లో తరగతులు చెబుతున్న ఉపాధ్యాయిని

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉన్న పాఠశాలల్లో మంగళవారం వరకూ జరిగిన ప్రవేశాలు ఇలా ఉన్నాయి.

మండలం	పాఠశాలలు	చేరిన విద్యార్థుల సంఖ్య
కవిటి	102	9,967
కంచిలి	100	8,556
సోంపేట	79	9,734
ఇచ్ఛాపురం	70	14,942

దూర ప్రాంతాల నుంచి వచ్చి చేరారు



రాజపురంలో ఏపీ మోడల్‌స్కూల్, బాలికోన్నత పాఠశాల ఉన్నప్పటికీ మా పాఠశాలలో ఇప్పటి వరకు 670 మంది విద్యార్థులు చేరారు. నెలాఖరునాటికి గత ఏడాదికంటే ఎక్కువ మంది చేరుతారనే ఆశాభావం ఉంది. దూర ప్రాంత గ్రామాలైన నెలవంక, ఈదుపురం, కొళాగాం, లొద్దపుట్టి, సవరదేవీపేట నుంచి 150 మంది బాలబాలికలు మా పాఠశాలలో చేరారు.

– శివరాంప్రసాద్‌పాఢి, హెచ్ఎం, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల,రాజపురం

ఇక్కడ మంచి బోధన అని తెలిసి చేరాను



మా సొంతూరు ఇచ్ఛాపురం మండలం కొళిగాం. రాజపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాబోధన అత్యున్నత ప్రమాణాలతో అందుతుందని విషయం తెలుసుకున్నాను. ఆ విషయం మా తల్లిదండ్రులతో చర్చించి ఇక్కడ అడ్మిషన్ తీసుకున్నాను. తరగతులు సక్రమంగా అవుతున్నాయి. బోధన బాగుంది. తల్లికి వందనం నిధులు అందుతాయి కనుక ప్రయాణ ఖర్చులు అందులో వినియోగించుకోవచ్చు అనే ధీమా ఉంది.

– హర్షవర్ధన్, రాజపురం బాలుర పాఠశాల, 6వ తరగతి

ఘనంగా ఆవేటి వారాలు



అమ్మవార్ల ప్రతిమలను ఊరేగిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మందస మండలంలోని మూలిపాడులో భక్తి శ్రద్ధలతో ఆవేటి సంబరాలు బుధవారం జరిగాయి. పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు గుసిరి వెంకటరావు ఆధ్వర్యంలో కొండ మహంకాళీ అమ్మవారు, గ్రామదేవతకు ప్రత్యేకపూజలు చేశారు. మేళ, తాళాలతో అమ్మవార్లను మహిళలు పూర్ణకుంభాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. స్థానికులు నాట్యాలతో అమ్మవార్లకు చల్లదనం చేశారు. గ్రామ పెద్దలు పిట్ట భీమారావు, పుప్పాల రాఘవరావు, దట్టి కోదండరావు, గుసిరి నాగేశ్వరరావు, గంగాధరరావు, బొందల వెంకటరావు, తెలుకల చక్రపాణి, తెలుకుల మురళి, దుదిష్టి, తెలుకల కృష్ణారావు ఉన్నారు.

అయ్యంకికి ఘనంగా నివాళి



టెక్కలి: వెంకటరమణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కాశీబుగ్గ: అయ్యంకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సిబ్బంది, పాఠకులు



సంతబొమ్మాళి: అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ తదితరులు

టెక్కలి: గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి వెంకటరమణ చేసిన సేవలు ఎనలేనివని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి బి.రూపావతి అన్నారు. బుధవారం అయ్యంకి వెంకటరమణ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠకుల సమక్షంలో అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీతాపతి, సాంబమూర్తి, నాగభూషణరావు ఉన్నారు.

కాశీబుగ్గ: పలాస శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణ 134వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి వై.రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఆర్‌పీలు ఉర్నాన అప్పలరాజు, పి.శేషగిరి, టి.శంకర్, ఎస్.భాస్కరరావు, కె.దుర్యోధన, డి.సునీల్‌బాబు, ఎస్.ఏర్మియ, ఎన్.ఉషా, పాఠకులు ఉన్నారు.

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి శాఖా గ్రంథాలయంలో అయ్యంకి చిత్ర పటానికి గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమంలో అయ్యంకి జీవితాంతము విశేషకృషి చేశారన్నారు. గ్రంథాలయ సహాయకులు బాబూరావు, పాఠకులు ఉమామహేష్, నారాయణ, రాజు, శంకర్, ఎంపీపీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి హడ్కోకాలనీ సమీపంలో వంశధార కాలవగట్టు ప్రభుత్వ స్థలాన్ని కోటబొమ్మాళి, నరసన్నపేటకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు ఆక్రమించుకున్నారని స్థానిక సర్పంచ్ కాళ్ల సంజీవరావు ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుల్కర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలంలో రియల్‌ఎస్టేట్ వెంచర్‌ను వేశారని, ఇళ్ల స్థలాలుగా చూపించి అమ్మకాలు సాగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్థానిక వీఆర్వో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పటించుకోలేదని పేర్కొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితము, కామర్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు బోధించేదుకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని, స్లెట్, ఏపీసెట్, నెట్, పీహెచ్‌డీ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 30వ తేదీ ఉదయం పది గంటలకు కళాశాల కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌లు, పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

రైతులకు యూరియా పంపిణీ



యూరియాను అందజేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: మండలంలోని మేఘవరం సచివాలయం పరిధిలోని రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు యూరియా బస్తాలను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.రాజశేఖర్‌రెడ్డి, సూరాడ దాసురాజు, సచివాలయ వ్యవసాయ అధికారి సుప్రియ పాల్గొన్నారు.

మహిళకు ఆర్థికసాయం



గౌరికి అండగా నిలిచిన మహిళా సంఘ సభ్యులు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి ఇందిరాకాలనీకి చెందిన ఒంటరి మహిళ కోరాడ గౌరికి మహిళా సంఘ సభ్యులు ఆర్థికసాయం అందించారు. బ్లడ్ సుగర్‌తో గౌరీ బాధపడుతూ మంచానికి పరిమితమైంది. ఈమె జైమాదుర్గ సంఘంలో సభ్యురాలు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు గుర్తించిన శ్రీగాయత్రి సమాఖ్యవారు 10,500 రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని 16వవార్డు కౌన్సిలర్ డిక్కల ఆనందరావు చేతులమీదుగా గౌరికి బుధవారం అందించారు. ఆర్పీ పుణ్యవతితో పాటు స్థానిక నాయకులు, మహిళా సంఘ నాయకులు పాల్గొన్నారు.

సందడిగా అర్బన్ బ్యాంకు డెలిగేట్ ఎన్నికలు



ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఉద్యోగులు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో బుధవారం అర్బన్ బ్యాంకు డెలిగేట్ ఎన్నిక సందడిగా జరిగింది. రైల్వే ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేస్తున్న కోఆపరేటివ్ బ్యాంకుకు సంబంధించిన ఎన్నికలలో ఆరుగురు పోటీపడ్డారు. 38వ కానిస్టెన్సీకి జె.తేజేశ్వరరావు, ఎల్.మోహనరావు, 40వ కానిస్టెన్సీకి డొక్కరి శ్యాంసుందర్, పి.వి.వి.ఎన్.రావు, 83వ కానిస్టెన్సీకి ఎం.ఎస్.ప్రసాద్, పి.ఎస్.రావులు పోటీ పడ్డారు. ప్రధానంగా ఈ ఎన్నికలు ఈస్‌కోస్ట్ రైల్వేశ్రామిక్ యూనియన్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ మధ్య జరిగింది. పలాస రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి 630 మంది ఉద్యోగులు ఓటు హక్కును పొందిఉండటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు విచ్చేశారు. ఇంతటి ఆన్‌లైన్ కాలంలోనూ పేపర్‌ను వినియోగించి బ్యాంకు నడుస్తుందని ఆన్‌లైన్‌కు ఎందుకు అర్బన్ బ్యాంకు దూరంగా ఉందని, పదహారేళ్ళగా ఎన్నికలు జరపకుండా ఎందుకు ఆపారని ఓ సంఘ నాయకులు ప్రశ్నిస్తు పోటా పోటీగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

'కేంద్రబడ్జెట్‌లో ఆదివాసీలకు అన్యాయం'



మాట్లాడుతున్న సురేంద్ర

కాశీబుగ్గ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024–బడ్జెట్‌లో దేశంలో ఉన్నటువంటి ఆదివాసీలకు నిధులు కేటాయించకుండా తీరని అన్యాయం చేశారని గిరిజన నాయకులు అన్నారు. మందస మండల కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర మాట్లాడారు. బడ్జెట్‌లో ఆదివాసీలకు రూ.13 వేల కోట్లు కేటాయించామని ప్రకటించడంలో వాస్తవం లేదన్నారు. గత బడ్జెట్ కంటే 4.31 శాతం అధికమని కేంద్ర గిరిజన శాఖ మంత్రి ప్రకటించడాన్ని తప్పుబట్టారు. ఇది కేవలం అంకెల.. మాయా బడ్జెట్ అని విమర్శించారు. తాజా బడ్జెట్‌లో కొత్త దనం ఏమీ లేదన్నారు. సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.అప్పన్న, సవర ధర్మారావు, మండల నాయకులు సవర గురునాథ్, సవర జయరాం, సవర బావన ఉన్నారు.

ఉద్యాన వనాల అభివృద్ధికి చర్యలు

- డ్వామా ఏపీడీ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కంచిలి: వ్యవసాయదారులకు ప్రయోజనం చేకూర్చడానికి జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా ఉద్యానవనాలు అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు డ్వామా ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్రసహాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీడి, మామిడి, కొబ్బరి, సపోటా, మునగ మొక్కలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఉద్యానవనాలు అభివృద్ధి చేసుకోవడానికి రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. మొక్కల పెంపకానికి మూడేళ్ల వరకు అయ్యే ఖర్చులను ఉపాధిహామీ పథకం ద్వారా రైతుకు అందజేస్తామన్నారు. మొక్కలు కావాల్సిన వారు తమను సంప్రదించాలని సూచించారు. కంచిలి మండలంలో 125 ఎకరాల్లో కొత్తగా ఉద్యాన వనాలు ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు స్థానిక ఏపీవో జి.ధనుంజయ తెలిపారు.

కాలి బాటలు ముఖ్యం



కాలిబాటపై అవగాహన కల్పిస్తున్న ఏవో భార్గవి

ఇచ్ఛాపురం రూరల్: వరినాట్లు వేసేటప్పుడు కాలి బాటలు వేసుకోవడం చాలా ముఖ్యమని మండల వ్యవసాయాధికారి టి.భార్గవి అన్నారు. ప్రకృతి వ్యవసాయం విభాగం ఆధ్వర్యంలో బుధవారం మశాఖపురంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాలిబాటలు వేసే ముందు రెండు గట్ల మధ్య తాళ్లు లాగి ఆ ప్రదేశాన్ని వదిలేసి వరినాట్లు వేసుకోవాలని సూచించారు. పొలంలో విత్తనాలను వెదజల్లిన రైతులు కూడా కాలిబాటలు తీసుకోవచ్చని, విత్తనాలు చల్లి 15 నుంచి 20 రోజుల్లోగా పైరు ఎదుగుతున్న సమయంలో మొక్కలను తొలగించి పక్కన నాటుకోడం ద్వారా బాటలు తీసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి మద్దిలి చిట్టిబాబు, వ్యవసాయ సహాయకుడు వెంకట్, ఆశి మాధవరావు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది నాగమణి, కుమారి, కృష్ణవేణి, రూప పాల్గొన్నారు.

తలసేమియా రోగికి అండగా..



ప్రవీణ్ పురియాకు మందులు అందజేస్తున్న శ్రీనివాసరావు

సోంపేట: కవిటి మండలం వరక గ్రామానికి చెందిన బాలుడు ప్రవీణ్ పురియా తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సోంపేట ఎస్ఎస్ ఫౌండేషన్ అండగా నిలిచింది. బుధవారం సోంపేట పట్టణంలో ఉద్దానం బ్లడ్ బ్యాంక్ సెంటర్ ద్వారా అవసరమైన రక్తాన్ని బాలుడికి సమకూర్చడంతోపాటు నెలకు సరిపడే పది వేల రూపాయల విలువైన మందులను ఫౌండేషన్ వ్యవస్థాపకులు దుద్ది శ్రీనివాసరావు అందజేశారు. తన కుమారుడికి ప్రభుత్వం నుంచి పింఛన్‌తో పాటు ఆర్థిక సాయం అందేలా కృషిచేయాలని ప్రవీణ్ పురియా తండ్రి శ్రీను పురియా సేవాసంస్థ ప్రతినిధులను కోరారు. ప్రతినిధులు బల్ల జానకీరావు, విక్కి, సతీష్, వాసు, కాళీ సాహు ఉన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు పరిశీలన



ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి సచివాలయంలో ఆధార్ శిబిరం



కవిటి: బెజ్జిపుట్టుగలో చిన్నారుల ఆధార్ డ్రైవ్ పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ పల్లవి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని అరకబద్ర, మండపల్లిలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఎంపీడీవో వై.వి.రాజేంద్రప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ నెల 27వ తేదీ వరకు మండల వ్యాప్తంగా గుర్తించిన గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కవిటి: మండలంలోని కపాసుకుద్ధి, బెజ్జిపుట్టుగ సచివాలయాల్లో నిర్వహించిన ఆధార్ స్పెషల్‌డ్రైవ్‌కు మంచి స్పందన లభించింది. బెజ్జిపుట్టుగలో రెండు రోజుల్లో 80 మంది ఆధార్ కార్డుల అప్‌డేట్, చిన్నారులకు కొత్తకార్డులు జారీ ప్రక్రియ జరిగింది. అలాగే కపాసుకుద్ధిలో 79 మందికి అప్‌డేట్, చిన్నారులకు కొత్తకార్డుల జారీ చేశారు. కొత్తకార్డుల జారీ ప్రక్రియ తీరును ఐసీడీఎస్ శాఖ సెక్టార్ సూపర్‌వైజర్లు పల్లవి, కృష్ణవేణి ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

టెక్కలి: టెక్కలి మండలం లింగాలవలస విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ జి.శంకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా లింగాలవలస, సీతాపురం, తిర్లంగి, పోలవరం, పెద్దసాన గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పలాస మండలంలో..

కాశీబుగ్గ: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ బ్రాహ్మణతర్లా, గొప్పిలి రూరల్ సబ్ స్టేషన్ల పరిధిలోని కైజోల, మహాదేవుపురం, టెక్కలిపట్నం, అనంతగిరి, వెంకటాపురం, కేశుపురం, బంటుకొత్తూరు, కేదారిపురం, పెదంచల, చినంచల, రాజగోపాలపురం, ఈదురాపల్లి, పూర్ణబద్ర గ్రామాలకు సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

క్షేత్ర పర్యటనతో విజ్ఞానం మెండు



పుట్టగొడుగుల గురించి అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు బృందావన్

ఇచ్ఛాపురం: డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న వారి కోసం అధ్యాపక సిబ్బంది నిర్వహిస్తున్న బొటానికల్ టూర్‌తో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతోందని స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రబీన్‌కుమార్ పాఢీ అన్నారు. మూడో సంవత్సరం విద్యార్థులకు ఐదో సెమిస్టర్‌లో భాగంగా బుధవారం క్షేత్రస్థాయి టూర్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు మంచిపుట్ట గొడుగులు, విషపూరితమైన పుట్టగొడుగుల గురించి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ప్రకృతి సిద్ధంగా లభించే పుట్టగొడుగులతో ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు.

టెక్నికల్ పనుల్లో అవగాహన అవసరం



సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు

కాశీబుగ్గ: నిర్మాణ రంగంలో లైసెన్స్ టెక్నికల్ పర్సన్లకు అవగాహన అవసరమని వక్తలు అన్నారు. కాశీబుగ్గ ఎస్ఎంసీ ఫంక్షన్ హాల్‌లో జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం బుధవారం జరిగింది. మున్సిపల్ టెక్నికల్ పర్సన్లు, ప్రైవేట్ ఇంజినీరింగ్ సిబ్బంది, సచివాలయ ఇంజినీర్లు పాల్గొన్నారు. సంఘ జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.జగదీశ్వరరావు, పలాస అధ్యక్షుడు ఊణ వెంకటరమణ మాట్లాడుతూ.. మారుతున్న కాలానుగుణంగా ఇంజినీరింగ్ పద్ధతులు మార్చాల్సిన అవసరం ఉంటుందన్నారు. భవన, ఇతర నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలని సూచించారు. సిమ్మెంట్, ఐరన్ వంటి వస్తువులు ఐఎస్ఐ మార్కు ఉన్నవే కొనుగోలు చేసి నిర్మాణదారులకు నష్టం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత టెక్నికల్ పర్సన్లపై ఉందన్నారు. అనంతరం టాటా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో నూతన భవన నిర్మాణ పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో బెల్లాల వెంకటరావు, టి.కృష్ణారావు, శాసనపురి సందీప్, దుంగ జగదీష్, ఎం.ఎస్.విజయకుమార్, వాసు ఉన్నారు.